క్లుప్తంగా

విద్యుత్ కోతలు ఎత్తివేయాలి

మరికల్: మండలంలోని తరచుగా విధిస్తున్న విద్యుత్ కోతలను ఎత్తివేయాలని రైతులు హన్మంతు, రాములు, మురళి అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత పదిరోజుల నుంచి వ్యవసాయ పొలాల వద్ద కరెంట్ గంటల తరబడి పోవడంతో పశువులకు నీళ్లులేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో అధికారులు స్పందించి 24గంటలు సరఫరా చేయాలని వారు కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని ఎక్కమేడ్‌లో సోమవారం ఎంపీడీఓ జయరాములు ఉపాధి పనులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ధారించిన కొలతల ప్రకారం పనులు చేపడితే అత్యధిక కూలీ వస్తుందని కూలీలకు వివరించారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఏపీఓ సిద్దేశ్వర్, ఎఫ్ఏ మల్లికార్జున్ ఉన్నారు.

పేదవిద్యార్థులకు ఉచిత శిక్షణ

మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో శ్రీ సిద్ధలింగేశ్వర పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠంలో 4నుంచి 7వ తరగతి ఇంగ్లిష్ మీడియం వరకు తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచిత శిక్షణ ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు మఠం పీఠాధిపతి శ్రీ పశ్చిమ సిద్ధలింగ మహాస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయకోసం 9000498101, 3100256318 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక



నారాయణపేట రూరల్: పట్టణానికి చెందిన హరిప్రియ గత విద్యా సంవత్సరంలో పీహెచ్ఈఎస్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ స్థానిక ఎస్ఎస్ఆర్ కోచింగ్ సెంటర్‌లో ఎన్ఎంఎస్ఎస్‌కు శిక్షణ పొందింది. ఈ క్రమంలో పరీక్షలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కోచింగ్ సెంటర్‌లో డైరెక్టర్ శేఖర్‌తోపాటు బోధకులు, విద్యార్థులు ఆమెకు మిఠాయిలు తి నిపించి అభినందించారు. కష్టపడి చదివితే ఎ లాంటి లక్ష్యాన్ని అయిన సాధించవచ్చన్నారు.

వీఆర్ఏలకు విధుల కేటాయింపు

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామ పెద్దవాగు నుంచి మక్తల్ మండలానికి చెందిన కొందరు జోరుగా అక్రమ ఇసుక రవాణా అనే వార్త 'సాక్షి' దినపత్రికలో రావడంతో స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ స్పందించారు. మండల వ్యాప్తంగా వాగు పరివాహక గ్రామాల వద్ద స్థానిక వీఆర్ఏలకు రాత్రి సమయంలో ప్రత్యేక విధులు వేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే సంబంధిత రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పల్లెర్ల హనుమంతరావు, నెహ్రూల సేవలు మరువలేం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన పల్లెర్ల హనుమంతరావు రెవెన్యూశాఖ మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలో ఎన్నో విద్యాసంస్థలకు స్థాపన కోసం ఆయన చేసిన కృషిని మరువలేమని కొనియాడారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, సీనియర్ నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు రాములు యాదవ్, ఫహీం, అజ్మత్‌అలీ, నాగరాజు, కిషన్‌నాయక్, షేక్ బాబుమియా, మాధవరెడ్డి, వెంకటలక్ష్మి, అంతయ్య, అక్బర్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



దారిచూపని బోర్డులు



గురువలింగంపల్లి-తళంకేరి గ్రామాలకు దారి చూపే సూచిక బోర్డు ఇలా..

- గ్రామాల్లో కానరాని సూచిక బోర్డులు
- దారి తెలియక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మాగనూర్: ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న సూచిక బోర్డులు తుప్పు పట్టిపోతున్నాయి. ఏళ్ల తరబడి వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో బోర్డులు ఏర్పాటుచేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మండల పరిధిలో ఏర్పాటుచేసిన సూచిక బోర్డుల్లో కొన్ని తుప్పుపట్టిపోతుండగా, మరికొన్ని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదల్లో ఉండి కనిపించడం లేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

తప్పని తిప్పలు..

మండల పరిధిలోని వర్కూర్- నేరడగం, నేరడగం దొడ్డి, బైరంపల్లి గ్రామాల మధ్య అదేవిధంగా వడ్వాట్- అడవిసత్యారం, అమ్మపల్లి- పర్మన్‌దొడ్డి, కొల్పూర్- మందిపల్లి, పూంజనూర్, ఇటు గురువలింగంపల్లి- తళంకేరి, కొత్తపల్లి గ్రామాలకు ఎన్నో ఏళ్ల క్రితం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సూచిక బోర్డులకు రంగులు వేసి గ్రామాల పేర్లు రాయించిన దాఖలాలు లేవు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సూచిక బోర్డులు కానరాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్య కూడళ్లలోని బోర్డులు నాలుగైదు ఏళ్ల క్రితమే రంగులు రంగుపోయి తుప్పుపట్టాయి. వీటికి మర్మతు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. రోడ్డుపక్కన పాఠశాలల గేట్ల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను కూడా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

సమస్య పరిష్కారానికి కృషి..



ప్రతి ఒక్కటి లేదా రెండు సంవత్సరాలకు ఇలాంటి వాటికి మరమ్మతులు చేయడం, కొత్తవి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సదరు రోడ్డు కాంట్రాక్టర్లకు ఉంటుంది. అయితే వారు నిర్లక్ష్యం చేస్తున్నారు. సూచిక బోర్డులకోసం ప్రతిపాదనలు పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– దర్మరాజు, పంచాయతీరాజ్ ఏఈ మాగనూర్

బోర్డులు ఏర్పాటు చేయాలి..



కొత్తపల్లి పాఠశాల ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో నిత్యం విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో రోడ్డు ప్రమాదాలు సంబవించి విద్యార్థులు గాయపడిన సంఘటనలు కూడా అనేకం. సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లిన ఫలితం మాత్రం లేకుండా పోయింది. అధికారులు ఇప్పటికైనా సందించి బోర్డులు ఏర్పాటు చేయాలి.

– కాశప్ప, కొత్తపల్లి గ్రామం

ఇబ్బందులు తొలగించాలి..



మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు సూచిక బోర్డులేకపోవడంతో మండలానికి కొత్తగావచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నారు. సమయంతోపాటు రవాణా ఖర్చులు వృథా అవుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటుచేసి ఇబ్బందులు తొలగించాలి.

– నాగరాజు, వడ్వాట్ గ్రామస్తుడు

అక్రమంగా మట్టి తరలింపు



చెక్‌డ్యాం సమీపంలో మట్టిని తవ్వుతున్న జేసీబీ

- జేసీబీ ద్వారా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు శివారులో ప్రభుత్వ భూమిలో కొన్ని రోజులుగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి 35సర్వే నంబర్‌లో గతంలో భూగర్భ జలాలు పెంచేందుకు వాటర్ షెడ్ ద్వారా కొన్నెళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించారు. కొల్లూరు గ్రామానికి కొందరు జేసీబీతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ ద్వారా గ్రామస్తులకు మట్టిని విక్రయిస్తున్నారు. భూగర్భజలాలు పెంచేందుకు చెక్‌డ్యాంను ఏర్పాటు చేసినా చెక్‌డ్యాం సమీపంలో మట్టిని తవ్వడంతో చెక్‌డ్యాం దెబ్బతినే పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి జేసీబీ సాయంతో పట్టపగలు తరలిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి మట్టి తవ్వకాలపై చర్యలు చేపట్టి సంబంధితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరారు. ఈ విషయమై తహసీల్దార్ మమతకు వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్విన విషయం తమకు తెలియదని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

నీటి ఎద్దడి తీర్చాలని వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న కాకర్ల నారాయణమ్మ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో ఆరునెలల నుంచి తీవ్ర తాగునిటి ఎద్దడి ఉందని వెంటనే నీటి ఎద్దడిని తీర్చాలని కోరుతూ వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ సోమవారం మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతి పత్రం అందజేశారు. తాను కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో ప్రత్యేకంగా శ్రీనగర్ కాలని ప్రజల తాగు నీటి కొరత తీర్చేందుకు మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయించామన్నారు. గత ఆరు నెలలనుంచి నిలిపోయిందని వెంటనే సంబంధిత అధికారులు పైప్‌లైన్ మరమ్మతులు చేయించి నీటి ఎద్దడి నివారించేందుకు కృషిచేయాలని కోరారు.

జీలుగ విత్తనాల పంపిణీ



కృష్ణా: రైతు ఆగ్రో సేవ కేంద్రం నుంచి మండల రైతులకు సోమవారం జీలుగ విత్తనాలను రాయితీపై అందించినట్లు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తమ పొలాల్లో జీలుగ విత్తుకోవడంతో పంటలకు మేలు జరుగుతుందని, అందుకు గాను రైతులు సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సదివినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



నర్వ: సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు జూబ్లిహిల్స్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ మేరకు.. వారు మాజీ ప్రధానమంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారన్నారు. ఈ మేరకు.. నియోజకవర్గ అభివృద్ధి పనులపై సీఎంతో ఎమ్మెల్యే చర్చించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల సమస్యలపై ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారన్నారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేతోపాటు మక్తల్ కాంగ్రెస్ నాయకులు, బీసం చెన్నయ్యసాగర్ రవి కుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

టిమ్ మిషన్లతో కండక్టర్ల పరేషాన్



జాజాపూర్ స్టేజీపై నిలిపిన ఆర్టీసీ అద్దె బస్సు



టిమ్ చెడిపోవడంతో బస్సులోనే కూర్చున్న ప్రయాణికులు

ప్రయాణికులకు తప్పని తిప్పలు

నారాయణపేట రూరల్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు టికెట్లు అందజేయడానికి సంస్థ ఏర్పాటు చేసిన టిమ్ మిషన్లతో కండక్టర్లు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. డిపో నుంచి లైన్ పైకి వచ్చిన తర్వాత ఆ యంత్రాలు మొరాయిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు టార్గెట్‌లకు మించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. వంద దాటి ఈపీకే వస్తుండటం చూస్తుంటే కండక్టర్లకు టికెట్ ఇవ్వడంపై తీవ్ర పని ఒత్తిడి తప్పడంలేదు. ఈ క్రమంలో టిమ్ మిషన్లు ఆకస్మాత్తుగా పనిచేయకుండా పోవడం, బటన్లు నొక్కినా టికెట్ రాకపోవడంతో పాటు స్క్రీన్‌పై అక్షరాలు కనిపించకుండా పోవడం, మరికొన్ని సార్లు అక్షరాలు తలకిందులుగా కనబడుతున్నాయని పలువురు కండక్టర్లు వాపోతున్నారు. బస్సు కొంత దూరం వెళ్లిన తర్వాత టిమ్‌లు మొరాయించడంతో సర్వీసును మధ్యలోనే ఆపివేయాల్సి వస్తుంది. మరో టిమ్ వచ్చే వరకు బస్సు కదలని పరిస్థితులు నెలకొన్నాయి. ఏది ఏమైనా కాలం చెల్లిన టిమ్ మిషన్లతో కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ రోజు జరిగిన సంఘటన..

❐ పేట డిపోకు చెందిన అద్దె బస్సు ఉదయం 6:30గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరింది. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లేవరకు కొంత మందికి టికెట్లు ఇచ్చిన కండక్టర్‌కు చేదు అనుభవం ఎదురైంది. టిమ్ మిషన్ పనిచేయకపోవడంతో జాజాపూర్ స్టేజీపై బస్సును నిలిపివేశారు. దాదాపు అరగంటకు పైగా ప్యాసింజర్లు బస్సులోనే ఇబ్బంది పడ్డారు. ఇంకా టికెట్ తీసుకుని వారు మాత్రం వెనక వచ్చిన మరో బస్సులో వెళ్లిపోయారు.

❐ ఇలా నిత్యం ఏదో ఒకచోట బస్సులో టిమ్‌లు మొరాయిండం పరిపాటిగా మారిపోయింది. ఆ రూట్‌లో అత్యవసర పనులపై వెళ్తున్న ప్రయాణికులు ఆలస్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాగనూర్‌లోని షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

మద్దూరు: వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొందరు నేరగాళ్లు తమ స్వలాభం కోసం అమాయక రైతులకు నష్టం కలిగించే విధంగా నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు అమ్ముతారు. అలాంటి వారు మండలంలో ఎక్కడ ఉన్న సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రాంలాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిషేధించిన కంపెనీల విత్తనాలుగానీ, లూజు విత్తనాలు గానీ అమ్మితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాగనూర్: విత్తనాల కొనుగోలులో రైతులు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుని మోసాలకు గురికాకుండా ఉండాలని ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు.. షాపు నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆకస్మికంగా పోలీసుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్ఐలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు పరిసరాలో సోమవారం సీఐ శివ శంకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్యాంకు వద్ద మార్చు వేసి దొంగతనాలు చేస్తున్న వారిని గుర్తించేందుకు, బ్యాంకు నుంచి ఎక్కువ డబ్బులు విత్ డ్రా చేసుకొని వెళ్తున్నవారు, బ్యాంకు వెలుపల ఉండి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు చేసినట్లు సీఐ శివశంకర్ తెలిపారు. బ్యాంకు లోపల సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం బ్యాంకుకు వచ్చిపోయే కస్టమర్లపై నిఘా ఉంచాలని ఎవరిపైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని వారికి సూచించారు.

వాడిపోతున్న హరితమొక్కలు



ఎండిపోయిన మొక్కలు

అమరచింత: పట్టణంలోని బస్టాండ్ వెనకాల నాటిన హరితహారం మొక్కలు వాడుముఖం పడుతున్న మున్సిపల్ అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు ప్రార్ధనా మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు నిత్యం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించాల్సిన అధికారులు మొక్కల సంరక్షణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో బస్టాండ్ వెనకాల నాటిన 70 మొక్కలకు ట్రీ గార్డ్‌లు ఏర్పాటు చేయకపోవడం, నీటిని అందించలేకపోవడంతో వాడుముఖం పడుతున్నాయి. అధికారులు స్పందించి మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు సవరమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ బోనాల జాతర ఉత్సవం మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం దేవాలయం ముందు పచ్చని పందిరి వేసి అమ్మవారికి కృష్ణ జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలను చేశారు. మంగళవారం వేకువజామున అమ్మవారికి అభిషేకాలతో పాటు బోనాలను సమర్పించి పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం అమ్మవారి విగ్రహాన్ని అలంకరించనున్నట్లు తెలిపారు. భక్తులు బోనాలు, కోళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారని, ఇది ఆనవాయితీ అని కమిటీ సభ్యులు తెలిపారు.

గాలివాన బీభత్సంతో.. కూలిన ప్రహరీ



నర్వ: మండలంలోని ఎల్లంపల్లిలో గాలివాన బీభత్సానికి పాఠశాల ప్రహరీ కూలినట్లు హెచ్ఎం వెంకటన్న తెలిపారు. భారీ వర్షానికి పాఠశాల ఆవరణలో ఉన్న వేపచెట్టు వేళ్లతో సహా కూలి ప్రహరీపై పడిందన్నారు. దీంతో పాఠశాల రక్షణ ప్రహరీ పూర్తిగా కూలిపోయిందని వాపోయారు. విషయంపై సోమవారం పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

అమరచింత: పట్టణంలోని మాదన్న కాంప్లెక్స్ సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం ఒరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌కో అధికారులు పట్టణంలోని ప్రధాన రహదారులపై వేలాడుతున్న తీగలను సైతం సరిచేయలేకపోతున్నారు. పంటపొలాల వెంట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ తీగలు సైతం నేలకు వాలిపోతున్న వాటిని మరమ్మతులు చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ బిల్లుల వసూళ్ల కోసం లైన్‌మన్‌లు వస్తుంటారే తప్ప సమస్యలను పరిష్కరించలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

కోయిల్‌కొండ: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వపాఠశాలల్లో విద్యబోధన చేస్తున్నట్లు హెచ్ఎం గంగ్యానాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని కనాయపల్లిలో బడి ఈడు కలిగిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయబృందంతో కలిసి.. ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలలో ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వసతులను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పుట్టపల్లి ధర్మారెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతు పనుల పరిశీలన

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం, అవుసలోనిపల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను సోమవారం ఎంపీడీఓ ధనుంజయగౌడ్ పరిశీలించారు. పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించి నాణ్యతతో పనులను చేపట్టాలని పాఠశాలలు ప్రారంభం కంటే ముందే పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మధురిమ, భవిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కృష్ణా: మండలంలోని తంగిడి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ధర్మతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.